
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com


## చేదెక్కిన చక్కెర..



2



2

## జీజీహెచ్‌లో నవజాత శిశువు మృతి..

## మంత్రి పొంగులేటిని కలిసిన సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం స్థల పరిశీలన కోసం మంత్రి పొంగులేటి జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను సీపీ సాయిచైతన్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.








## శ్రీవారి కొండకు పోటెత్తిన భక్తజనం

**అక్షరటుడే, బాన్సువాడ:** గోవిందా.. గోవిందా.. నామస్మరణలతో బీర్కూర్ మండలం తిమ్మాపూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానం మారు మోగింది. శ్రావణ మాసం శనివారం కావడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. దీంతో శ్రీవారి కొండ భక్తజన సంద్రంగా మారింది. ఈ సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. శ్రావణ మాసం శనివారం శ్రీనివాసుడిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. భక్తుల సౌకర్యార్థం బాన్సువాడ నుంచి కొండ వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. సర్పంచులు అప్పారావు, దేవిసింగ్, నరసరాజు పాల్గొన్నారు.





# నిజామాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్..

■ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి ■ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం ■ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ■ తహశీల్దార్, ఆర్డీవో నూతన కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపన

హైదరాబాద్ తరహాలో నిజామాబాద్‌లో సైతం పేదల కోసం ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి, వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వం సంకల్పమని పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలో శనివారం మంత్రి పలు ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు.

- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ

నాగారంలోని నిర్మితి కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారుల కోసం నిర్మించనున్న హౌసింగ్ టవర్స్ స్థలాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో ఆరు అంతస్తులతో కూడిన టవర్స్ నిర్మించనున్న నేపథ్యంలో తగిన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. అనంతరం 43వ డివిజన్ లోని పాములబస్తీలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో మంత్రి భేటీ అయ్యారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, సకాలంలో బిల్లులు వచ్చాయా? అని తెలుసుకున్నారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేశారు. చివరి దశ నిర్మాణంలో ఉన్న ఇళ్లను సైతం సందర్శించి, త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

### కలెక్టరేట్ సమీపంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు..

కలెక్టరేట్‌కు ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంత్రి పొంగులేటి పరిశీలించారు. తక్షణమే పెండింగ్ పనులను పూర్తి చేయాలని కంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత ఎంతమాత్రం లేదని, పనులు పూర్తి చేసిన 24 గంటల వ్యవధిలో బిల్లులు మంజూరు చేస్తామని అన్నారు. గుత్తేదారుతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించి, డబుల్ బెడ్ రూమ్ భవన సముదాయాన్ని స్వాధీనపర్చుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, సానిటేషన్ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు.

### డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ

అనంతరం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అర్బన్ నియోజకవర్గ లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా డబుల్ బెడ్రూం ఇండ్ల పత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, భూపతి రెడ్డి, మేయర్ ఉమారాణి, గృహ నిర్మాణ సంస్థ ఎం.డీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



### రూపాయి ఖర్చు లేకుండా పేదలకు ఇళ్లు..

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రూపాయి ఖర్చు లేకుండా పేదలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని అన్నారు. పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన పేదలకే ఇళ్లు కేటాయిస్తున్నా మని స్పష్టం చేశారు. మహిళల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వారి పేరిటే ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని అన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లు.. నిరంతర ప్రక్రియ..

ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేసేంతవరకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కమీషన్‌లకు ఆశపడి కాళేశ్వరం కట్టారు కానీ.. పదేళ్లకాలంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని మంత్రి పొంగులేటి ఆక్షేపించారు. నగరంలో ప్రస్తుతం 400 మంది లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్లను పంపిణీ చేస్తున్నామని, వారం పది రోజుల్లో మరో 300 మందికి అందజేస్తామని అన్నారు. నగరంలో హౌసింగ్ బోర్డుకు చెందిన నాగారం నిర్మితి కేంద్రం వద్ద ప్రయోగాత్మకంగా ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించామన్నారు.

### కార్యాలయ భవనాలకు శంకుస్థాపన

నిజామాబాద్‌లో రూరల్‌లో తహశీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణాలకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆధునిక వసతులతో నిర్మించనున్న ఈ కార్యాలయ భవనాలు ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన పరిపాలనా సేవలు అందించేందుకు దోహదపడనున్నాయని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి కలెక్టరేట్ లో అన్నిశాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు భూపతి రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కవిత, సీపీ సాయి చైతన్య, డీఆర్‌వో గీత, ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పొంగులేటి రాజీ నామాకు డిమాండ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్రంలో 22ఏ భూముల వ్యవహారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సమీక్షలో పాల్గొన్న మంత్రిని ఘెరావ్ చేశారు. దినేష్ కులాచారి మాట్లాడుతూ.. 22ఏ భూముల వ్యవహారంలో మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాత్రికి రాత్రే అనుమతులున్న భూములు 22ఏలోకి వెళ్లడంతో సాధారణ ప్రజలు బ్యాంకు లోన్లు తీసుకునే వెసులుబాటు కోల్పోయారన్నారు. దీనికి మంత్రి పొంగులేటి బాధ్యత వహించాలన్నారు. అప్పటి వరకు ఆయనను కలెక్టరేట్ దాటనివ్వబోమని భీష్మించారు. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు కలిసి కలెక్టరేట్ లోని సమావేశంలో హాల్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య తోపులాట జరిగింది.



## కళాశాలలో సమస్యలపై ప్రజాప్రతినిధులు స్పందించాలి

**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు కొత్మిర్కర్ వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కళాశాలలో 8 గ్రూపుల్లో వెయ్యి మందికి పైగా విద్యార్థులు చదువుతున్నప్పటికీ 10 గదులు మాత్రమే ఉన్నాయని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తగినన్ని బెంచీలు, డెస్కులు లేక కొంతమంది విద్యార్థులు నేలపై కూర్చొని చదువుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బాధ్యతగా స్పందించి అదనపు తరగతి గదులు, బెంచీలు ఏర్పాటు చేయాలని కోరారు.




## ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని మాచాపూర్ గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువ నమోదైనందున రాబోయే సీజన్‌లకు నూనెగింజల సాగు పైన రైతులు దృష్టి సారించాలన్నారు. అలాగే ఫాంపాండ్స్ నిర్మించుకొని నీటిఎద్దడి నుండి బయటపడాలని, ఆయిల్ పామ్ సాగు గ్రామాల వారీగా విస్తీర్ణం పెంచుకొని అధిక దిగుబడులు సాధించాలన్నారు. సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఏఈవోలు రాజాగౌడ్, ముఖీత్, రవీందర్, రవికుమార్, రైతులు నర్సింహారెడ్డి, అంజయ్య, రామకృష్ణ, హరికృష్ణ, ఇసాక్, రైతులు పాల్గొన్నారు.

## అనుమతుల్లేని క్లినిక్‌లపై వైద్యశాఖ చర్యలు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లావ్యాప్తంగా అనుమతుల్లేని క్లినిక్‌లు, ఆస్పత్రులపై వైద్యశాఖ వరుస దాడులకు పాల్పడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి తాళం వేస్తోంది. నగరంలోని ఖలీల్‌వాడిలో శనివారం డీఎంహెచ్‌వో రాజశ్రీ ఆధ్వర్యంలో వైద్యాధికారులు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ల్యాబ్, క్లినిక్, ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. ఖలీల్‌వాడీలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి క్లినిక్‌లో తనిఖీ చేసిన అధికారులు నిబంధనలుకు విరుద్ధంగా నిర్వహిస్తుండడంతో తాళం వేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జిల్లాలో అనుమతులేని ఆస్పత్రులు, క్లినిక్‌లలో వైద్యం కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వాటిని మూసివేస్తున్నామని తెలిపారు.






## అర్బన్‌లో డబుల్ బెడ్‌రూమ్ టవర్లు నిర్మించాలి

**అక్షరటుడే, ఇందూరు:** నియోజకవర్గంలో స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల టవర్లను నిర్మించి ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో పేదలకు స్థలం ఉండే అవకాశం లేదని, ప్రభుత్వ స్థలంలోనే హైదరాబాద్ తరహాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల టవర్లను నిర్మించాలని కోరారు. ప్రధానంగా రెండు దశల్లో గత 12ఏళ్లుగా తెలంగాణలో డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వని నియోజక వర్గం కేవలం నిజామాబాద్ అర్బన్ మాత్రమే అన్నారు. ఇప్పటికైనా ఇవ్వడం సంతోషకరమన్నారు. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకి సంబంధించి పలు అంశాలను తీసుకెళ్లానని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా సంపాదించిన ఆస్తులు జప్తు: సీపీ



**అక్షరటుడే,నిజామాబాద్ క్రైం:** అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల అక్రమ తయారీ, రవాణా, సరఫరాపై పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపుతోంది. బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు ఆధ్వర్యంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పోలీసులు ఇటీవల ఛేదించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్ప్రాజోలం తయారీ, సరఫరాకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్లపై కేసు నమోదు చేశారు. వారి నుంచి 2.5 కిలోల అల్ప్రాజోలం, స్కోడా కారు, 8 మొబైల్ ఫోన్లు, రూ.2.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీస్ కస్టడీలోకి తీసుకుని విచారించగా అల్ప్రాజోలం తయారీ, సరఫరాకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. సీపీ ఆదేశాల మేరకు బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు ఆధ్వర్యంలో సుమారు 15 మంది పోలీసు సిబ్బందితో బృందం మహారాష్ట్రకు వెళ్లి వారం రోజుల పాటు విస్తృతంగా దర్యాప్తు చేపట్టింది. మహారాష్ట్రలోని సతారా పారిశ్రామిక ప్రాంతంలో, 'సూర్య ప్రభ ఫార్మా కెమ్' పేరుతో ఎరువుల తయారీ కోసం అనుమతులు పొంది, అక్రమంగా అల్ప్రాజోలం తయారు చేస్తున్న ఫ్యాక్టరీని గుర్తించారు. అక్కడ నిర్వహించిన సోదాల్లో సుమారు రూ.3 కోట్ల విలువైన సుమారు 30 కిలోల అల్ప్రాజోలం, అక్రమంగా సంపాదించిన రూ.12 లక్షల నగదు, ఒక ఫోర్డ్ కారును స్వాధీనం చేసుకుని, అక్రమంగా నిర్వహిస్తున్న ఫ్యాక్టరీని సీజ్ చేశారు. డ్రగ్స్ అమ్మకాలు, తయారీ ద్వారా కూడబెట్టిన రూ.5.15 కోట్ల ఆస్తులను జప్తు చేసేందుకు పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. నిందితులు అమర్‌సింగ్, బసవరాజ్, లక్ష్మణ్ గౌడ్, వారి కుటుంబ సభ్యులు అల్ప్రాజోలం అక్రమ విక్రయాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించారు. ప్రభుత్వ విలువల ప్రకారం సుమారు రూ.5.15 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించగా, బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ మరింత ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీపీ కోరారు.


## విద్యార్థులు పోటీతత్వంతో చదవాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యార్థులు పోటీతత్వంతో ముందుకు సాగాలని లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్షుడు పి.రాఘవేంద్ర బాబు సూచించారు. విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో శనివారం మాక్లూర్ మండలం ధర్మోరా గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. రాఘువేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అలాగే పాఠశాలకు గొల్ల రాజు ప్రొజెక్టర్‌ను అందజేశారు. స్పాన్సర్‌గా వ్యవహరించిన లయన్స్ క్లబ్ పూర్వాధ్యక్షుడు శివలింగం, చింతల గంగాదాస్, అంకం రాజేందర్, పి.శ్రీనివాస్, సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగేష్, పాఠశాల హెచ్ఎం శంకర్ పాల్గొన్నారు.

# చేదెక్కిన చక్కెర..

- పదిరోజుల క్రితం రూ.45 మాత్రమే..
- ఇప్పుడు ఏకంగా రూ.70కు చేరిన ధర
- ఆందోళనకర స్థాయికి చక్కెర నిల్వలు
- వంట నూనెలు, బియ్యం ధరలకూ రెక్కలు




**చక్కెర చేదెక్కింది. కనీవినీ ఎరుగని రీతిలో రిటైల్ మార్కెట్‌లో కిలోకు ధర రూ.70 నుంచి 75 వరకు పలుకుతోంది. 10 రోజుల క్రితం వరకు కిలో రూ.45కు లభించిన చక్కెర ఇప్పుడు ఏకంగా రూ.25 అధికం కావడం ప్రజలకు, విక్రేతలకు కూడా రుచించడం లేదు.**

**- అక్షరటుడే, ఎల్లారెడ్డి**

### రెండేళ్లలో ఇదే అత్యధిక ధర..

హోల్ సేల్ మార్కెట్‌లో 10 రోజుల క్రితం వరకు కిలో చక్కెర ధర రూ.42 నమోదైంది. రిటైల్‌లో రూ.45కు విక్రయించారు. హైదరాబాద్‌లో మాత్రం దుకాణాల్లో రూ.50 దాకా విక్రయించారు. ఇప్పుడు హోల్‌సేల్ ధర కిలోకు రూ.70కి చేరింది. రెండేళ్లుగా చక్కెర ధర రిటైల్‌లో రూ.45 వద్దే కొనసాగుతూ వస్తోందని హోల్ సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

### పండుగల సీజన్‌లో..

మరోవైపు వంట నూనెల ధరలకూ రెక్కలు వచ్చాయి. ఇంటి సరుకుల్లో ప్రధాన ఉత్పత్తులు ప్రియం కావడంతో పండుగల సీజన్ వేళ వినియోగదారులకు చేదు కబురు అందినట్లయింది. చక్కెర ఉత్పత్తి తగ్గడం, ఇథనాల్ తయారీకి చెరకు మళ్లింపు, చక్కెర నిల్వలు తక్కువగా ఉండడం, వర్షాభావ పరిస్థితులు, పండుగల సీజన్ డిమాండ్ ప్రస్తుత పరిస్థితికి కారణమని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

### ఆందోళనకరంగా నిల్వలు

ధరలు తగ్గుతాయని ఎదురు చూస్తున్నా సామాన్యులపై భారం తప్పడం లేదు. దేశంలో చక్కెర నిల్వలు 30 ఏళ్ల కనిష్ఠ స్థాయికి చేరతాయని అంచనా. ఈ అంశమే ఇప్పుడు మార్కెట్‌ను కలవరపెడుతోంది. ఇక నూనెల ధర రకాన్ని బట్టి రిటైల్‌లో ఒక్కో ప్యాకెట్ పై రూ.5 నుంచి 15 వరకు పెరిగింది. వారంలోనే నూనెల ధర పెరిగిందని రిటైల్ వర్తకులు తెలిపారు. ధరలు ఇలా పెరిగితే ఎలా బతకాలని ప్రజలు అంటున్నారు.

### భారీగా పెరుగుతున్న వస్తువుల ధరలు

పెరుగుతున్న నిత్యావసరాల ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. పెరిగిన ధరలను చూసి నిత్యావసరాలు కొనాలంటే జేబు ఖాళీ అవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో పాలు, పెరుగు, నూనె ధరలు పెరగడంతో సామాన్యుల బడ్జెట్ తలకిందులైంది. వెల్లుల్లి, అల్లం ధరలు పైపైకి దూకుతున్నాయి. కూరగాయల ధరలూ తగ్గేలా కనిపించట్లేదు. ఇంటి ఇల్లాలి బడ్జెట్‌కు చిల్లు పడుతోంది.

### కొండెక్కుతున్న ఉల్లి, మిర్చి..

మార్కెట్లో ఉల్లి ధరలు కొండెక్కి కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మొన్నటి వరకు కిలో రూ.25 నుంచి 30 పలికిన ఉల్లి నేడు కిలో రూ.50కి చేరింది. నిత్యావసరాలు, కూరగాయల ధరలు గణనీయంగా పెరగడంతో నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కిలో వెల్లుల్లి రూ.280 వరకు ఉంది. పాత వెల్లుల్లి రూ.80కి అమ్ముతున్నారు. అల్లం కిలో రూ.240కి చేరింది. పాత అల్లం రూ.70కి తక్కువ లేకుండా ఉంది.

### సన్న బియ్యానికి రెక్కలు..

జిల్లాలో సన్నబియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. మొన్నటి వరకు హెచ్ఎంటీ క్వింటా బస్తా రూ.6,200 ఉండగా, ఇప్పుడు రూ.6,600కి చేరింది. రూ.400 పెరిగింది. ఇతర సన్నరకాల ధరలు క్వింటాకు రూ.500 నుంచి రూ.700 వరకు పెరిగాయి. కందిపప్పు కిలో రూ.130 ఉండగా, రూ.10 పెరిగి రూ.140 నుంచి 150 వరకు అమ్ముతున్నారు. మినపప్పు కిలో రూ.130 ఉండగా, ఇప్పుడు రూ.148కి చేరింది. శనగపప్పు కిలో రూ.75 ఉండగా, రూ.85కి చేరుకుంది. వంట నూనె లీటర్ సాధారణ ధర రూ.170 ఉండగా, ఇప్పుడు రూ.180కి చేరింది. ఇతర కిరాణా వస్తువుల ధరలూ గణనీయంగా పెరిగాయి.

## పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి హల్‌చల్..
## సీఐ, కానిస్టేబుల్‌కు గాయాలు

**అక్షరటుడే, బోధన్:** గంజాయి మత్తులో వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో హల్‌చల్ చేశాడు. పోలీసులపై దాడికి సైతం తెగబడ్డాడు. ఈ ఘటన బోధన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం కొప్పర్గా గ్రామానికి చెందిన ఓ మహిళ చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి కొన్నిరోజుల క్రితం వచ్చింది. అక్కడ చికిత్స అనంతరం ఆమె కొప్పర్గకు వెళ్లిపోయింది. అయితే శుక్రవారం రాత్రి ఆ గ్రామానికి చెందిన సాయిలు అనే వ్యక్తి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి హల్‌చల్ చేశాడు. సదరు మహిళకు ఇచ్చిన ట్రీట్‌మెంట్ ఏమిటని ప్రశ్నిస్తూ డ్యూటీ డాక్టర్‌తో వాగ్వాదానికి దిగాడు. దీంతో భయభ్రాంతులకు గురైన వైద్యురాలు, సిబ్బంది కలిసి డయల్ 100కు ఫోన్ చేశారు. పోలీసులు స్పందించి ఆస్పత్రికి చేరుకుని ఆ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే గంజాయి మత్తులో ఉన్న ఆ వ్యక్తి ఆగ్రహంతో సీఐ, కానిస్టేబుల్‌పై దాడికి తెగబడ్డారు. సీఐ తొడపై దాడి చేశాడు. . అలాగే కానిస్టేబుల్ వేలు కొరకడంతో కొద్దిభాగం తెగిపోయింది. దీంతో హతాశులైన పోలీసులు వెంటనే ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు.



## రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఉచిత వైద్య శిబిరం

**అక్షరటుడే,ఇందూరు :** లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఫోర్ట్ సిటీ, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ సౌజన్యంతో శనివారం రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఎముకలు, గుండెకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న సుమారు 300 మందికి చికిత్సలు నిర్వహించారు. ఎముకల దృఢత్వం తెల్సుకునేందుకు బీఎండీ పరీక్షలతో పాటు షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు కూడా ఉచితంగా చేశారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు జగదీష్ మడిరెడ్డి, ఎముకల వైద్య నిపుణులుఅభిషేక్ బార్లీ, కీర్తి కృష్ణ వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ పూర్వ గవర్నర్ ఇరుకుల వీరేశం, జిల్లా కార్యదర్శులు డి.యాదగిరి, పీ లక్ష్మీ నారాయణ, పి.రవీంద్ర కుమార్ గుప్తా, శివరాజం, ఛైర్మన్లు డి.నాగేశ్వరరావు, బిర్ల రామారావ్, పెద్ది రాజేందర్, రాఘవేందర్, చింతల గంగాదాస్, మండవ రామకృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో లోక్ అదాలత్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి సుస్మా ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్‌కు సంబంధించిన కేసుల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం జరిగింది. ఈ లోక్ అదాలత్‌లో వివిధ యూనియన్ బ్యాంక్ శాఖలకు సంబంధించిన మొత్తం 5 కేసులు పరిష్కారమయ్యాయి. ఇరు పక్షాల అంగీకారంతో మొత్తం రూ.3,53,000లకు రాజీ కుదిరింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా వివాదాలను సులభంగా, తక్కువ ఖర్చుతో, త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. బ్యాంకుకు సంబంధించిన పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించడం ద్వారా ఖాతాదారులకు కూడా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ పవన్, ఎల్లారెడ్డి యూనియన్ బ్యాంక్ మేనేజర్ పాల్గొన్నారు.




## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు..

**అక్షరటుడే, ఆర్మూర్:** యూరియా కోసం ఆర్మూర్‌లో రైతులు రోడ్డెక్కారు. పట్టణంలోని ఆరు పంతల రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వారు నిరసన వ్యక్తం చేశారు. యూరియా యాప్‌తో సంబంధం లేకుండా ఒక రైతుకు ఎకరానికి మూడు సంచుల యూరియా, రెండు సంచుల కాంప్లెక్స్ ఎరువును సొసైటీ ద్వారా అందజేయాలని నినదించారు. వరి మొక్కజొన్న పంటను కాపాడి రైతులను అండగా నిలవాలని కోరారు.



## నల్లూర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హులందరికీ నూతన రేషన్‌కార్డులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొలివి శ్రీకాంత్, సర్పంచ్ బర్కం గంగారెడ్డి, ఉప సర్పంచ్ బర్కం లావణ్య, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి. ఫణిందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిలివేరి రాజ్‌కుమార్, వార్డు సభ్యుడు అక్కపత్రి ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బర్కం శ్రీనివాస్, పిండి రాజేశ్వర్, బర్కం చిన్న గంగాధర్, జీపీవో సురేష్, అంగన్‌వాడీ టీచర్లు షామాల, మంజుల తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థి సంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం పర్యటించారు. మంత్రి పర్యటనను విద్యార్థి సంఘాలు అడ్డుకునే అవకాశాలున్నాయని పేర్కొంటూ పోలీసులు పలువురు నాయకులను ముందుస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కర్క గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే అషూర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వాటిని పరిష్కరించకుండా విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## లెక్చరర్లను నియమించాలని ఆందోళన



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కళాశాల ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. జువాలజీ, సివిక్స్ తదితర సబ్జెక్టుల బోధన సక్రమంగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరగతుల్లో పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యార్థులు కోరారు. ప్రతిరోజూ ప్రైవేట్ క్లాసులకు బయటకు వెళ్లాల్సి వస్తోందని, తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. లెక్చర్లను నియమించాలని గత ఏడాది కాలంగా పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని విద్యార్థులు ఆరోపించారు. తక్షణమే నూతన లెక్చర్లను నియమించాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా నోడల్ అధికారి సలాం మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఐదు రోజుల్లోగా అవసరమైన లెక్చర్లను నియమిస్తామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి..

**అక్షరటుడే, బాల్కొండ :** రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ ఘటన చిట్టాపూర్ నుంచి శ్రీరాంపూర్ వైపు వెళ్లే మార్గంలో చోటు చేసుకుంది. బాల్కొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చిట్టాపూర్ నుంచి శ్రీరాంపూర్ వైపు వెళ్లే మార్గంలో శుక్రవారం రాత్రి మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అయితే మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదు. వయస్సు 55 నుంచి 65 ఏళ్ల మధ్య ఉండి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. వివరాలకు బాల్కొండ ఎస్‌హెచ్‌వో 8712659860, లేదా బాల్కొండ పోలీస్‌స్టేషన్ 8712659756లలో సంప్రదించాలని కోరారు.

## జీజీహెచ్ పైనుంచి దూకి రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** పోలీసుల కట్టుదిట్టమైన భద్రతలో ఓ నిందితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నగరంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో లకావత్ రాజు అనే వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా అతడిని ఇటీవల సారంగపూర్ సెంట్రల్ జైలుకు తరలించారు. అయితే శనివారం సాధారణ వైద్యపరీక్షల్లో భాగంగా ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి అతడిని తీసుకొచ్చారు. అయితే జైలు పోలీసుల ఎస్కార్ట్ మధ్య ఉన్న లకావత్ రాజు వారిని తప్పించుకుని జీజీహెచ్ మూడో అంతస్తు నుంచి కిందికి దూకాడు. దీంతో అతడి తలకు, ఛాతిలో బలమైన గాయాలయ్యాయి. హఠాత్తుగా జరిగిన ఈ ఘటన నుంచి తేరుకున్న పోలీసులు వెంటనే రాజును జీజీహెచ్‌లోని ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. ప్రస్తుతం అతడికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన జీజీహెచ్‌లో కలకలం రేపింది.

## జీజీహెచ్‌లో నవజాత శిశువు మృతి.. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆందోళన

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా ఆస్పత్రిలో మరొక ప్రాణం ప్రపంచాన్ని చూడకుండానే కన్ను మూసింది. నవజాత శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమేనని ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. డీఎస్పీ మధుసూదన్ ఆధ్వర్యంలో బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం.. లింగంపేట మండలం ఎక్కపల్లి తండాకు చెందిన సరిచంద్‌కు తాడ్వాయి మండలం నందివాడకు చెందిన స్వరూపతో 15 నెలల క్రితం వివాహమైంది. మెదటి కాన్పు కావడంతో పురిటి నొప్పులతో కామారెడ్డి జీజీహెచ్‌కు శుక్రవారం ఉదయం వచ్చారు. అయితే నొప్పులు ఎక్కువగా ఉన్నాయని, ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యులు వైద్యులను కోరారు. సాధారణ డెలివరీ అవుతుందని వైద్యులు జాప్యం చేయడంతో ఖచ్చితంగా ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. దాంతో మీరే చేయండి ఆపరేషన్, మాకు తెలియదా.. ఏం చేయాలో కూడా మాకు చెప్తారా అంటూ సిబ్బంది బాధిత కుటుంబ సభ్యులపై దురుసుగా ప్రవర్తించారని కుటుంబ సభ్యులు తెలిపారు. అయినప్పటికీ ఆపరేషన్ చేయకుండా శనివారం ఉదయం వరకు వేచి చూసి ఆపరేషన్ చేయగా మృతి చెందిన మగబిడ్డ జన్మించాడని వాపోయారు. తమ ఇంటి వారసుడిని వైద్యులు పొట్టన పెట్టుకున్నారని, బిడ్డ చనిపోయిన విషయం కూడా తమకు చెప్పలేదని ఆరోపించారు. కాగా మృతి చెందిన శిశువును పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోస్టుమార్టం గది వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



### రక్త హీనతతో వచ్చారు..

ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. సదరు గర్భిణి ఆస్పత్రికి రక్త హీనతతో వచ్చిందని, దాంతో వైద్యులు రక్తం కూడా ఎక్కించారన్నారు. ఇవాళ ఆపరేషన్ చేస్తుండగా రక్తం తక్కువ ఉండటంతో కడుపులో ఉన్న బాబు ఊపిరి పీల్చుకోలేక ఇబ్బంది పడ్డాడని, వైద్యులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. దీనిపై అంతర్గత ప్రైమరీ ఎంక్వైరీ కమిటీ వేసి విచారణ జరుపుతామన్నారు. సిబ్బంది దురుసుగా మాట్లాడిన విషయంపై విచారణ చేస్తామన్నారు. వైద్యుల నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.